పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

వికారాబాద్, ఏప్రిల్ 29 : పార్లమెంటు ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికల విధులను నిర్వహించే సెక్టోరల్ అధికారులు, పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ సిబ్బందికి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోస్టల్ బ్యాలెట్‌పై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో ఉన్నామని ఓటు వేయడంలో నిర్లక్ష్యం వహించకుండా తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్, పీడబ్ల్యూడీ ఓటింగ్ విషయంలో గోప్యత నిర్వహించాలని తెలిపారు. 85 ఏండ్లు దాటిన వయోవృద్ధులు, 40 శాతం పైబడి అంగవైకల్యం కలిగిన వారు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునే క్రమంలో పోలీస్, డీపీవో, పోలింగ్ అధికారి, బూత్‌స్థాయి అధికారులతో పాటు వీడియోగ్రాఫర్ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి, డీపీవో జయసుధ, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎన్నికల మాస్టర్ ట్రైనర్స్ రాంరెడ్డి, వీరకాంతం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సమావేశానికి హాజరైన నోడల్ అధికారులు, సిబ్బంది

సీనియారిటీ ప్రకారం డ్యూటీలు కేటాయించాలి

తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం సభ్యులు

కొడంగల్, ఏప్రిల్ 29 : అన్ని ఉపాధ్యాయ సంఘాలకు సీనియారిటీ ప్రకారం ఎన్నికల విధులను కేటాయించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల పరిధిలో టీఎస్‌యూటీఎఫ్, టీఎస్ ఎస్‌టీయూ, టీపీయూఎస్, డీటీఎఫ్ సంఘాలు ఉన్నాయని, పీఆర్‌టీయూకు ప్రాధాన్యతనిస్తూ ఆ సంఘం సభ్యులకు ఎక్కువ మొత్తంలో డ్యూటీలను వేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ఉపాధ్యాయ సంఘాలకు ప్రాధాన్యతనిస్తూ డ్యూటీలను కేటాయించాలని కోరారు. అలాగే హోం ఓటింగ్, బ్యాలెట్ ఓటింగ్ ఇతర డ్యూటీలను అన్ని సంఘాల సభ్యులకు సమానంగా వేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బస్సప్ప, ముత్యప్ప, అశోక్‌కుమార్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి

- మాటల గారడి చేసే పార్టీలను నమ్మకండి
- పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

కులకచర్ల, ఏప్రిల్ 29 : బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుకోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి, పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సత్తినేని సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కులకచర్ల, చౌడాపూర్ మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం, విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీతోనే సంక్షేమ పథకాలు అమలు జరిగాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న చేవెళ్ల ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకుందామని కార్యకర్తలకు సూచించారు.

బీసీలకు అవకాశం...

చేవెళ్ల ఎంపీ స్థానాన్ని బీఆర్ఎస్ పార్టీ బీసీలకు కేటాయించిందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బీసీలకు ఎంపీ టికెట్ కేటాయించడాన్ని ప్రతి బీసీ నేతలు స్వాగతించారని, ఇందుకోసం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పరిగి ప్రాంతానికి దొరికిన మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించి గెలుపు కోసం సహకరించాలని సూచించారు.

గారడీ చేసే పార్టీలను, నాయకులను నమ్మకండి

ఎన్నికల్లో గారడి చేసే పార్టీలకు, నాయకులను నమ్మరాదని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఓట్లకోసం వచ్చే నాయకులను నమ్మి మోసపోకుండా జాగ్రత్త వహించాలని, ఈ విషయాన్ని ప్రజలకు పూర్తి స్థాయిలో తెలియజేయాల న్నారు. కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంటు ఎన్నికల ఇన్‌చార్జి రామచందర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి, కులకచర్ల జడ్పీటీసీ రాందాస్‌నాయక్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నాగరాజు, రాజప్ప, సారా శ్రీనివాస్, మాలె కృష్ణయ్యగౌడ్, దామో దర్‌రెడ్డి, అంతారం మొగులయ్య, రఘు, నర్సింహులు, గుండు మల్ల నర్సింహులు, శంకర్‌నాయక్, గండి లక్ష్మయ్య, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, చౌడాపూర్ మండల యువజన విభాగం అధ్యక్షుడు మేగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి మాదిగల ద్రోహి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే రత్నం

వికారాబాద్, ఏప్రిల్ 29 : సీఎం రేవంత్‌రెడ్డి మాదిగల ద్రోహి అని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పేర్కొన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని స్వాగత్ హోటల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, బీజేపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ ఏ కులానికి వ్యతిరేకం కాదని, వెనుకబడిన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. ఆయన జీవిత మంతా వెనుకబడిన వారు ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో పని చేస్తున్నారని తెలిపారు. కొడిగుడ్ల స్కామ్, దాణా కుంభకోణం, భూ కబ్జాదారుడైన రంజిత్‌రెడ్డిని చిత్తు చిత్తుగా ఓడించాలని రంజిత్‌రెడ్డి స్థానికుడు కాదని, బతుకుదెరువు కోసం వచ్చి చేవెళ్ల ప్రజలను మోసం చేస్తున్నారని వివరించారు. మాల, మాదిగ ఉప కులాలు ఏకమై రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. 70 ఏండ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు ఉన్నత సీట్లు కేటాయించడంలో విఫలమైందన్నారు. ఏన్నో ఏండ్లుగా దళితులను ఓటు బ్యాంకుగా వాడుకుంటుందని తెలిపారు. రేవంత్‌రెడ్డిని బండ బూతులు తిట్టిన గడ్డం రంజిత్‌రెడ్డిని మళ్లీ కాంగ్రెస్‌లోకి ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు.

నేడు మందకృష్ణ మాదిగ రాక

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మంగళవారం వికారాబాద్‌కు రానున్నారని కేఎస్ రత్నం తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవ రెడ్డి, నాయ కులు వడ్ల నందు, నవీన్‌కుమార్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు, కార్యదర్శులు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

తాండూరు రూరల్, ఏప్రిల్ 29: తాండూరు మండలం, జినుగుర్తి గ్రామంలోని శ్రీ ఆంజనేయ దేవాలయం ముందు ఉత్తమ్‌చంద్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం ధ్వజస్తంభ అధిరోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి నిర్వహకులు కరంచంద్, మోహన్‌దాస్, జగదంబ, రాలింగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, వడ్డే శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ మండల స్థాయి సమావేశం

దోమ, ఏప్రిల్ 29 : చేవెళ్ల పార్లమెంట్ నియోజక వర్గ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం బీఆర్ఎస్ పార్టీ దోమ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం మధ్యాహ్నం 12 గంటలకు పరిగి రోడ్‌లోని ఎస్‌జీ గార్డెన్‌లో ప్రారంభం కానున్నదని పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, జడ్పీటీసీ నాగిరెడ్డి తదితరులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ స్థాయిల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో తరలి వచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఫోర్జరీ పత్రాలతో మోసగించిన ముగ్గురు అరెస్టు

సిటీబ్యూరో, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ భూమిని రెసిడెన్షియల్ ప్లాట్లుగా అభివృద్ధి చేయడంతో పాటు వాటికి ఎన్‌ఓసీలను కూడా తీయిస్తామని నమ్మబలికి, రూ.3.13కోట్లు తీసుకుని మోసగించిన దంపతులు సహ మరో వ్యక్తిని సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గండిపేట, నార్సింగి ప్రాంతానికి చెందిన పట్టి శ్రీకాంత రావు(54), ప్రేమ లత(38) దంపతులు. అదే ప్రాంతానికి చెందిన దర్శనం శివరాజ్(45)తో కలిసి వారి బంధువైన సీహెచ్. శ్రీనివాసరావుకు సంబంధించిన వ్యవసాయ భూమిని రెసిడెన్షియల్ ప్లాట్లుగా అభివృద్ధి చేయడంతో పాటు వాటికి సంబంధించిన ఎన్‌ఓసీలను కూడా తీయించి, ఇస్తామని నమ్మబలికి.. అతడి వద్ద నుంచి రూ.3.13 కోట్లు వసూలు చేశారు. కాని, ఒప్పందం ప్రకారం చేయాల్సిన అభివృద్ధి చేయకపోవడంతో శ్రీనివాస రావు పలుమార్లు నిందితుల ప్రశ్నించినా ఫలితం లేకపోవడంతో తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీశాడు. దీంతో, నిందితులు రెండు చెక్కులను ఇవ్వగా.. అవి బౌన్స్ అయ్యాయి. అంతేకాకుండా.. ఫోర్జరీ సంతకాలతో నకిలీ పత్రాలు సృష్టించి, డీఏజీపీఏ చేయించుకోవాలని బాధితుడికి అందజేశారు. తీరా వాటిని తీసుకుని రంగారెడ్డి జిల్లా రిజిస్టర్ ఆఫీస్‌కు వెళ్లగా.. అవి నకిలీ పత్రాలని అధికారులు చెప్పడంతో నివ్వెరపోయిన బాధితుడు నార్సింగి పోలీసులను ఆశ్రయించాడు. అయితే, ఇది ఆర్థిక నేరాలతో ముడిపడి ఉండటంతో స్థానిక పోలీసులు ఈ కేసును సైబరాబాద్‌లోని ఆర్థిక నేరాల విభాగానికి బదిలీ చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన ఈఓడబ్ల్యూ పోలీసులు సోమవారం పట్టి శ్రీకాంత రావు(54), ప్రేమ లత(38) దంపతులతో పాటు దర్శనం శివరాజ్(45)ను అరెస్టు చేశారు. ఈఓడబ్ల్యూ డీసీపీ కె.ప్రసాద్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ బి.నరహరి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పెట్రోల్ పోసుకున్న రాజు

వికారాబాద్, ఏప్రిల్ 29 : ధారూరు మండలం హరిదాస్‌పల్లికి చెందిన దళితుడైన సుదర్శన్ చావుకు కారణమైన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని మృతుడి కుమారుడు రాజు సోమవారం వికారాబాద్ డీఎస్పీ కార్యాలయం వద్ద పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఆ యువకుడి వద్ద ఉన్న పెట్రోల్ డబ్బాను తీసుకొన్నారు. ఇదిలావుండగా సుదర్శన్ చావుకు సంబంధించిన కేసు దర్యాప్తులో ఉందని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. మృతుడి కుమారుడు చేసిన ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదన్నారు. ఎవరైనా పోలీసు అధి కారుల విధులకు ఆటంకం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

పీఆర్సీని పెంచాలని కమిషన్‌కు వినతిపత్రం

పీఆర్సీ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వైద్యుల సంఘం నాయకులు

కులకచర్ల, ఏప్రిల్ 29 : నిత్యావసర ధరలకు అనుగుణంగా పీఆర్సీని పెంచాలని ఎంపీహెచ్ఈవో, సీహెచ్‌వోల అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఖలీముద్దీన్, ప్రధాన కార్యదర్శి చంద్రప్రకాశ్ పీఆర్సీ కమిషన్ చైర్మన్ శివశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. నిత్యావసర ధరలు పెరిగిన దృష్ట్యా వాటికి అనుగుణంగా ఫిట్‌మెంట్‌ను పెంచుతూ నివేదిక ఇవ్వాలని కోరారు. ఎంపీహెచ్‌ఈవోలకు క్యాడర్‌కు పీహెచ్‌ఎన్‌హెల్త్ ఎడ్యుకేటర్ ఇస్తున్న పేస్కేలు వర్తింపజేయాలని కోరారు. హెల్త్‌డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న మొదటి లెవల్ గెజిటెడ్ అధికారులందరికీ అడ్మినిస్ట్రేటివ్ అధికారుల పేస్కేల్ వర్తింప జేయాలని, ఎఫ్‌టీఏను 75శాతానికి పెంచుతూ నివేదిక పంపించాలని కోరగా.. చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఫసీయుద్దీన్, యాదనాయక్ పాల్గొన్నారు.

వికారాబాద్, ఏప్రిల్ 29 : వికారాబాద్ పట్టణంలోని రాజీవ్ గృహకల్ప, రామయ్యగూడ ఎంఐజీ ప్రాంతాల్లో సోమవారం నిర్వహించిన ముగ్గుల కార్యక్రమంలో చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి కొండా సంగీతారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ, సాంప్రదాయాలను కాపాడడంలో మహిళల పాత్ర అమూల్యమన్నారు. భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచదేశాలకు చాటి చెప్పారని తెలిపారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ..
భవనం పైనుంచి పడి బాలుడి మృతి

మల్కాజిగిరి, ఏప్రిల్ 29: సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. హస్మత్‌పేటకు చెందిన మ్యాథ్యూ కుమారుడు రవీంద్ర(16) భవనం పైకి ఎక్కి స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న తన తల్లితో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టప్పాచబుత్రాలో 9.50 లక్షలు పట్టివేత

కార్వాన్, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అడుగడుగునా వాహన తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం టప్పాచబుత్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్ ఏ.రాములు ఆధ్వర్యంలో ఎస్ఐలు ఆదిల్, అంజాద్ షరీఫ్ తమ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో గుడిమల్కాపూర్ రోడ్డులో ఓ కారును తనిఖీ చేసి, యశ్వంత్ సాయి అనే యువకుడి నుంచి రూ. 2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా.. భోజగుట్టకు చెందిన సురేశ్ వద్ద నుంచి రూ.7.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా.. అమ్మాపూర్ లోధ్ క్షత్రియ నగర్‌కు చెందిన అర్చన అనే మహిళ నిర్వహిస్తున్న బెల్టు షాపు నుంచి మద్యం బాటిళ్లు కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పాఠశాలల్లో పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

కులకచర్ల, ఏప్రిల్ 23 : పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో రామకృష్ణనాయక్ తెలిపారు. మంగళవారం అల్లాపూర్, రాంరెడ్డిపల్లి, ముజాహిద్‌పూర్ గ్రామాల్లోని పాఠశాలల్లో చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో ఏర్పాటు చేసిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌లుగా గ్రామ సంఘాల అధ్యక్షులను ప్రభుత్వం నియమించిందని తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి ఈ కమిటీలు పని చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో నిర్ణయించిన మేరకు పనులు పూర్తి చేసేందుకు చైర్‌పర్సన్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు అలివేణి, ఏపీఎం శోభ, మహిళా సమాఖ్య మండల ప్రతినిధులు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

బోరు మోటారుకు మరమ్మతులు

పరిగి, ఏప్రిల్ 29 : పరిగి పురపాలక సంఘం పరిధిలోని 6వ వార్డు పరిధిలో గల బోరు మోటారు పాడవడంతో మంచినీటి సమస్య తలెత్తింది. మూడు రోజులుగా నీటి సరఫరాకు ఇబ్బంది కలిగింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ వెంటనే మోటారు బాగు చేయించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బొంబాయి నాగేశ్వర్, నాయకులు గౌస్‌పాష తదితరులు పాల్గొన్నారు.

రూ.19.20 కోట్ల నగదు స్వాధీనం

సిటీబ్యూరో, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు గ్రేటర్ వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.19.20 కోట్ల నగదును ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ తెలిపారు. రూ.8.22 కోట్ల విలువజేసే ఇతర వస్తువులు, 21,466 లీటర్ల అక్రమ మద్యాన్ని కూడా పట్టుకున్నట్లు చెప్పారు. 248 మందిపై కేసులు నమోదు చేసి, 246 మందిని అరెస్టు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన నగదు, ఇతర వస్తువులపై 520 ఫిర్యాదులు రాగా, వాటిని పరిష్కరించారని, 338 మందిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 3,024 లైసెన్స్ ఆయుధాలను కూడా డిపాజిట్ చేసినట్లు రోనాల్డ్‌రాస్ తెలిపారు. తాజాగా, గడిచిన 24 గంటల వ్యవధిలో రూ.16.913 లక్షల నగదు, రూ.20,652 విలువైన వస్తువులను పట్టుకొని, సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

మేడేను విజయవంతం చేయాలి: బీఆర్‌టీయూ

వికారాబాద్, ఏప్రిల్ 29 : మేడేను జయప్రదం చేయాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు భూమోళ్ల కృష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు కార్మికుల హక్కుల్ని కాల రాస్తున్నాయని తెలిపారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మండల, డివిజన్, జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ర్యాలీలు, సభల్లో పాల్గొనాలని కోరారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

మర్పల్లి, ఏప్రిల్ 29 : మండలంలోని కల్‌ఖోడా గ్రామంలో చెలిమేటి నర్సింహులు సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌కేఆర్ ట్రస్ట్ చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి నర్సింహులు అంత్యక్రియలకు రూ.ఐదు వేలు పంపగా మాజీ సర్పంచ్ రాచన్న బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందజేశారు

30న.. దుండిగల్ పరిధిలో

డ్రోన్‌లపై ఆంక్షలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): ఈ నెల 30న భారత ప్రధాని పర్యటన నేపథ్యంలో దుండిగల్ ఠాణా పరిధిలో రిమోట్ సహాయంతో పనిచేసే డ్రోన్‌లు, పారా గ్లైడర్స్, మైక్రో లైట్స్ ఎయిర్ క్రాఫ్ట్స్ వంటి వాటిని ఎగురవేయడంపై ఆంక్షలు విధిస్తూ సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆంక్షలు అమలులో ఉన్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై సంబంధిత సెక్షన్ల కింద కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీపీ హెచ్చరించారు.

మైనర్‌పై లైంగికదాడి కేసులో జైలు శిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): బంధువుల ఇంటికి వచ్చిన బాలికకు మాయమాటలు చెప్పి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు బూడిద బాలనర్సయ్య (43)కు 20 ఏండ్ల జైలుశిక్ష, 25వేల జరిమానా విధిస్తూ.. బాధిత బాలికకు పదిలక్షల పరిహారం చెల్లించాలని రంగారెడ్డి జిల్లా 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీమతి హరీష తీర్పునిచ్చారు. అదనపు పీపీ కోమలత కథనం ప్రకారం.. మంచాల మండలం లోయపల్లిలోని బంధువుల ఇంటికి బాధిత బాలిక తన తల్లితో కలిసి వచ్చింది. 2016, జూన్ 28 అమాయకురాలైన ఆ బాలికకు మాయమాటలు చెప్పి నిందితుడు తనతో తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం పెళ్లి చేసుకుంటానని బాలికను నమ్మించి మరో గ్రామంలో కాపురం పెట్టాడు. బాలిక కోసం వెతుకుతున్న తల్లికి గ్రామస్థుల ద్వారా విషయం తెలియడంతో మంచాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు బాల నర్సయ్యను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా.. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

మరో కేసులో 2 ఏండ్ల జైలుశిక్ష..

తనను ప్రేమించాలంటూ బాలిక వెంటపడుతూ వేధిస్తున్న హయత్‌నగర్ మండలం బండ రావిరాల గ్రామానికి చెందిన నిందితుడు కందికంటి భానుచందర్ (20)కు రెండేళ్ల జైలు శిక్ష, మూడువేల జరిమానా విధిస్తూ.. బాలిక కుటుంబానికి లక్ష రూపాయల పరిహారం అందజేయాలని రంగారెడ్డి జిల్లా పోక్సో కోర్టు తీర్పునిచ్చింది.

రైలులో ప్రయాణిస్తున్న ఎస్ఐని దోచుకున్న కేసులో..
నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు

కాచిగూడ, ఏప్రిల్ 29 : ఎంఎంటీఎస్ రైల్లో ప్రయాణిస్తున్న ఎస్సైను ఈ నెల 26వ తేదీ అర్ధరాత్రి చాకుతో బెదిరించిన కేసులో నిందితులను పట్టుకునేందుకు రెండు ప్రత్యేక రైల్వే పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మైలార్‌దేవ్‌పల్లికి ప్రాంతానికి చెందిన డి.ప్రసాద్ వెస్ట్‌బెంగాల్ డార్జిలింగ్‌లో సీఆర్‌పీఎఫ్‌లో ఎస్సైగా పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని ఇంటికి వెళ్లడానికి సికింద్రాబాద్– ఫలక్‌నామ ఎంఎంటీఎస్ రైల్లో వెళ్తుండగా.. యాకుత్‌పుర రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని 4 దుండగులు రైల్లోకి ప్రవేశించి, ఎస్సైను చాకుతో బెదిరించారు. అతడి వద్దనున్న 2.5 తులాల బంగారు గొలుసు, రూ.700 నగదు, 2 సెల్‌ఫోన్లను లాక్కొని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వెంటనే దర్యాప్తు చేపట్టిన రైల్వే పోలీసులు.. ఘటన జరిగిన ప్రదేశంలోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా పోలీసులు.. నేరం జరిగిన సమయంలో వెళ్తున్న వెళ్తున్న నలుగుర్ని గుర్తించారు. వారిని పట్టుకునేందుకు రెండు ప్రత్యేక పోలీసులు బృందాలు రంగంలోకి దిగాయి. అయితే, నిందితుల ముఖాలు సీసీ ఫుటేజీల్లో స్పష్టంగా కనిపించకపోవడంతో కొంత ఇబ్బందిగా మారినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. దుండగులకు సంబంధించిన సమాచారం ఉంటే 87126 58584, 8712658620 నంబర్లకు ఫోన్ చేసి ఇవ్వాలని కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ కోరారు.

అక్రమంగా తరలిస్తున్న నగదు పట్టివేత

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 29: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నగదును తరలిస్తుండగా ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఏటీఎంలలో నగదు లోడ్ చేసే వాహనాన్ని సీజ్ చేసి, పేట్ బషీరాబాద్ పోలీసులకు అప్పగించారు. బ్రింక్స్ క్యాష్ లాజిస్టిక్స్ వాహనంలో రూ. 74,07,796 నగదు ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.